క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం

బొండపల్లి: మండలంలోని మరువాడలో ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడులు చేపట్టి చుక్క అప్పారావు నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు మాట్లాడుతూ.. ఇంత వరకు 141 బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి 1442 మద్యం సీసాలు, 10 బీర్లు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది బి. గంధర్వుడు, వి.అప్పారావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


నియామకపత్రాలు అందజేస్తున్న బూత్ ఇన్‌చార్జ్ రమణ

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ బూత్ ఇన్‌చార్జ్, గొట్లాం పీఏసీఎస్ మాజీ చైర్మన్ మహంతి రమణ సూచించారు. మండలంలోని ఒంపల్లిలో పార్టీ అనుబంధ విభాగాల్లో నియమితులైన వారికి ఆదివారం నియామకపత్రాలు అందజేశారు. అనంతరం పార్టీ గ్రామ అధ్యక్షుడిగా సర్పంచ్ లండ నారాయణమ్మను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు, వేంద్రం సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శృంగవరపుకోట: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్.కోట పోలీసులు ఆదివారం మధ్యాహ్నం దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి నాలుగు ఫోన్‌లు, రూ. 7,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి. నారాయణమూర్తి తెలిపారు.

జాతీయ పతాకాలతో నిరసన


బొద్దవరలో ఆందోళన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్‌కి ఇచ్చిన భూములను తమకు అప్పగించాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు ఆదివారం జాతీయ పతాకాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘ నాయకుడు జగన్ మాట్లాడుతూ.. అధికారులు గిరిజన రైతులను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ


ఒంటరి వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఈఓ బి.శైలజ, తదితరులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలో గల ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు దాతలు సమకూర్చిన 12 రకాల నిత్యావసర సరుకులను మేజర్ పంచాయతీ ఈఓ బెహరా శైలజ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం


వేపాడ బీసీ కాలనీ గణనాథుడ్ని ఊరేగిస్తున్న యూత్ సభ్యులు

వేపాడ: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలను వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో ఊరేగించి శనివారం వేకువజామున కోనేరులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోలాటం, భజనలు, ప్రత్యేక వేషధారణలు, సాము గరిడీలు, యువత నృత్యాలు, మేళతాళాల నడుమ విగ్రహాలను ఊరేగించారు. మండల కేంద్రంలోని వేపచెట్టు వద్ద 25 ఏళ్లుగా వినాయకుడ్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన చేపట్టారు.

జామి: మండలంలోని జాగరంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని శనివారం రాత్రి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత నృత్యాలు చేస్తూ వినాయకుడిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ లేక అవస్థలు..!

- పెదవేమలి వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలెక్టరేట్‌లోని ఎంఎస్ఎంఈ విభాగానికి డిప్యూటేషన్‌పై పంపిన వైనం
- అతని స్థానంలో ఎవరిని నియమించక పోవడంతో పది నెలలుగా ఇబ్బందులు

గంట్యాడ:

గ్రామ సచివాలయ వ్యవస్థలో వెల్ఫేర్ అసిస్టెంట్ (సంక్షేమ సహాయకుడు) పాత్ర చాలా కీలకం. మిగతా వారితో పోల్చితే విధులు ఎక్కువే. అటువంటి వెల్ఫేర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై కలెక్టరేట్ ఎంఎస్ఎంఈ విభాగానికి పంపించారు. అతని స్థానంలో ఎవ్వరినీ నియమించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెదవేమలి గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌ను 2024 డిసెంబర్‌లో కలెక్టరేట్ లోని ఎంఎస్ఎంఈ విభాగానికి డిప్యూటేషన్ వేశారు. అతని స్థానంలో ప్రత్యామ్నాయంగా ఎవరినీ ఇంతవరకు నియమించలేదు. దీంతో మిగతా ఉద్యోగులపై పనిభారం పడుతోంది. మిగతా సిబ్బందికి కూడా వివిధ రకాల సర్వేలు అప్పగించడంతో వారు ఇటు వెల్ఫేర్ అసిస్టెంట్ విధులు, అటు వారి విధులు చేయలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.



పెదవేమలి గ్రామ సచివాలయం

కీలక విధులు..

సచివాలయంలో కీలక విధులు నిర్వహించేది వెల్ఫేర్ అసిస్టెంటే. పింఛన్లు.. తల్లికి వందనం.. వసతిదీవెన.. విద్యాదీవెన వంటి సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం.. వాటిని ఆన్‌లైన్ చేయడం.. పింఛన్ల సొమ్ము బ్యాంక్ నుంచి విత్ డ్రా చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది.

తప్పని ఇబ్బందులు..

పది నెలలుగా వెల్ఫేర్ అసిస్టెంట్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంతవరకు ఆయన స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. వసతి దీవెన, తల్లికి వందనం వంటి పథకాలకు సంబంధించి వివరాలు నమోదు చేయించుకునేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

వెనక్కి తీసుకొస్తాం..

పెదవేమలి వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలెక్టరేట్‌లోని ఎంఎస్ఎంఈ విభాగానికి డిప్యూటేషన్ వేయడం జరిగింది. అతన్ని వెనక్కి తీసుకొచ్చే ఏర్పాటు చేస్తాం.

– ఆర్‌వీ రమణమూర్తి, ఎంపీడీఓ, గంట్యాడ

దగాకోరు ప్రభుత్వంలో రైతుకు అన్యాయం


పార్టీ నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ నెల 9న ఆర్డీఓ కార్యాలయం వద్ద అన్నదాత పోరు పేరిట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను అర్దాన్నపాలెం సమీపంలో గల క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సమస్యలపై ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందన్నారు. రైతులకు యూరియా అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఎరువులను బ్లాక్‌మార్కెట్‌లో కూటమి నాయకులు విక్రయించుకుంటూ కోట్లు కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఇటువంటి పరిస్థితి లేదన్నారు. రైతు ఇంటివద్దే ఎరువులు, విత్తనాలు అందించామని చెప్పారు. అన్నదాతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, కొత్తవలస మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాల పార్టీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, ఒబ్బి నాయుడు, ముమ్మలూరు జగన్నాథం, గొర్లె రవికుమార్, ఎస్.కోట వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ పీతల కృష్ణ, పార్టీ నాయకులు బొంతల వెంకటరావు, పల్లా భీష్మ, మదీన అప్పలరమణ, యడ్ల కిశోర్, తూర్పాటి అప్పలరాజు, బీపీ నాయుడు, పెనగంటి చెల్లయ్య, మాధవరావు, లెంక వెంకన్నపాల్గొన్నారు.

అవగాహన సదస్సులు

జామి: మండలంలోని కుమరాం, ఏఆర్‌పేట రైతు సేవా కేంద్రాల వద్ద మండల ప్రత్యేకాధికారి కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎ.డి భానులత మాట్లాడుతూ.. యూరియా అధిక మోతాదులో వినియోగిస్తే చీడపీడలు ఎక్కువవుతాయని చెప్పారు. అధిక దిగుబడులకు నానో యూరియా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఎంపీడీఓ (ఎఫ్ఏసీ) నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు..

వేపాడ: యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ఏఓ స్వాతి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది యూరియా వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. 500 ఎం.ఎల్ నానో యూరియా ఎకరా పొలంలో పిచికారీ చేసుకుంటే ఒక యూరియా బస్తా ఇచ్చిన ఫలితం ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు కోమలత, పవన్, తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: బల్లంకిలో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వాతి


కుమరాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారి కుమారస్వామి, తదితర అధికారులు

కబ్జాదారులకు అధికారులు సహకరించడం బాధాకరం

నెల్లిమర్ల రూరల్: చెరువులను పరిరక్షించాల్సిన అధికారులే కబ్జాదారులకు సహకరించడం బాధాకరమని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతీకృష్ణమూర్తినాయుడు, గౌరవాధ్యక్షుడు భారతానంద స్వామీజీ అన్నారు. మండలంలోని తంగుడుబిల్లి కాలనీ వద్ద వివాదాస్పద చెరువును ఆయన ఆదివారం పరిశీలించి, గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అధికారులే అక్రమార్కులకు సహకరించడం నేరమని, కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆవేదనను పరిగణలోకి తీసుకుని, చెరువును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

చీపురుపల్లి: రైతులు ఎరువుల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి సూర్యకుమారి తెలిపారు. మండలంలోని పుర్రేయవలసలో ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. సాగులో అవసరమైన మోతాదులో ఎరువులు వినియోగించాలన్నారు. యూరియా స్థానంలో నానో యూరియా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ కె.హేమసుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగించాలి..

దత్తిరాజేరు: రైతులందరూ నానో యూరియా, డీఏపీ వినియోగించాలని మండల ప్రత్యేక అధికారి విమలారాణి అన్నారు. మండలంలోని దత్తి, లింగరాజపురం గ్రామాల్లో ఏఓ అనురాధతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న ఏఓ సూర్యకుమారి

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


కొట్టాంలో అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాల ఆవిష్కరణలో పాల్గొన్న దళిత సంఘాల నేతలు

శృంగవరపుకోట: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అంతా కలిసి పనిచేయాలని ఉద్యమనేత ఎ.ఉదయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. మండలంలోని కొట్టాం, ధర్మవరం గ్రామాల్లో ఆదివారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించా రు. ఈ సందర్భంగా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ద్వారా రాజ్యాంగ పరిరక్షణకై దళిత బహుజనులు ఐక్యం కావాలన్నారు. అనంతరం అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘా ల నేతలు డోల కేశవ, గుర్రపు శ్రీను, తెరపల్లి కోట రావు, సూరిబాబు, బోనెల ఈశ్వరరావు, మెయ్యి రమణ, కె.వెంకటఅప్పారావు, కె.సన్యాసిరావు, పన్నా శివరామకృష్ణ, బోని శేఖర్, తదితరులు హాజరయ్యారు.

ఉపాధ్యాయులను సన్మానించిన ‘లక్ష్య’

శృంగవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులను లక్ష్య ఫౌండేషన్ సభ్యులు ఆదివారం స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న విద్యార్థులతో ఏర్పాటైన లక్ష్య ఫౌండేషన్ కొంతమంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈ సన్మాన కార్యక్రమానికి డీఈఓ మాణిక్యంనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె. వెంకటరమణ, రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ ఎస్.టి.నాయుడు, డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసిరాజులతో పాటు లక్ష్య ఫౌండేషన్ సభ్యులు సీహెచ్ శర్మ, అజ్జాడ నరేష్, వి.ఈశ్వరరావు, ఎస్.శివరామకృష్ణ, జె.అప్పలనాయుడు, రహీమ్ షేక్‌లాల్, ఎం.భాస్కరరావు, కె.మోహన్‌రాజు, జి.రవికుమార్, జి.వెంకటరావు, జి.శ్రీనివాసరావు, ఎ.రవిశంకర్, సత్యారావు, ఎం.సత్యసాహితి, వై.భాస్కరరావు పాల్గొన్నారు.


‘లక్ష్య’పురస్కారం అందుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఆందోళన తగదు

శృంగవరపుకోట: యూరియా సరఫరాపై ఎలాంటి ఆందోళనలు వద్దంటూ మండల వ్యవసాయాధికారి కె.రవీంద్ర అన్నారు. మండలంలోని సంతగవిరమ్మపేట, గోపాలపల్లి, సీతారాంపురం గ్రామాల్లో ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలో 48 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఎస్.కోట, పెదఖండేపల్లి, మూలబొడ్డవర గ్రామాల్లో సోమవారం నుంచి యూరియా విక్రయిస్తామన్నారు. అనంతరం నానోయూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రి అసిస్టెంట్లు లావణ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవీంద్ర

అన్నదాత పోరును విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు రైతులకు యూరియా అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని.. ఈ ప్రభుత్వానికి రైతుగోడు పట్టదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. రైతన్నకు అండగా మంగళవారం చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గరివిడిలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలువురు నాయకులు అన్నదాత పోరు పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుకు ఇంటి వద్దనే విత్తనాలు, ఎరువులు అందజేయగా.. నేడు వాటి కోసం అన్నదాతలు రోడ్డెక్కాల్సి వస్తోందన్నారు. పార్టీ పిలుపు మేరకు 9న చీపురుపల్లిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కూటమి పాలనలో ఒక్క బస్తా యూరియా కోసం ఎన్నో ఇబ్బందులు పడాల్సి రావడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు కడుమల రాంబాబు, యల్లంటి పోలీస్‌నాయుడు, రఘుమండ శ్రీదేవి, బమ్మిడి కార్తీక్, వలిరెడ్డి లక్ష్మణ్, అలమండ అప్పలనాయుడు, చంద్రకుమార్, బాగు రమేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.


గరివిడి: అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అన్నదాతకు అండగా..


గుర్ల: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, శీర అప్పలనాయుడు

గుర్ల: అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు 9వ తేదీన చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి నాయకులు ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించుకుంటూ, రైతులను మోసం చేస్తు న్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వరదా ఈశ్వరరావు, బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం, జమ్ము స్వామినాయుడు, కెంగువ మధుసూదనరావు, తోట తిరుపతిరావు, అట్టాడ అప్పలరాజు, ఇజ్జిరోతు ప్రసాద్, మంత్రి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

తరలిరండి..


మెరకముడిదాం: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెరకముడిదాం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9న చీపురుపల్లిలో నిర్వహించనున్న అన్నదాత పోరుబాటకు తరలిరావాలని మెరకముడిదాం మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్, తలచుట్ల హరిబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమలింగాపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతులకు అవసరమైన ఎరువులు అందివ్వలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పప్పల కృష్ణమూర్తి, ఎస్.సీతారామరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, లెంక భాస్కరరావు, లెంక త్రినాథరావు, గంట్యాడ రామారావు, ముదుండి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి


గజపతినగరం రూరల్: అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గజపతినగరం రూరల్: అన్నదాత పోరు కార్యక్రమంతో కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎరువులు అందించలేని దుస్థితిలో పాలకులు ఉండడం సిగ్గుచేటని నాయకులు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, గజపతినగరం జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, గంట్యాడ జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, పోరిపిరెడ్డి నారాయణమూర్తి, కరణం ఆదినారాయణ, కందితిరుపతినాయుడు, కృష్ణార్జునులు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, చుక్క మురళీ, ఆల్తి గణపతి, ఫణీంద్రుడు, తాడ్డి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో కషాయాల పిచికారీ లాభదాయకం

శృంగవరపుకోట: డ్రోన్‌తో కషాయాల పిచికారీ రైతాంగానికి చాలా లాభదాయకమని ఆర్‌టీఎల్ ప్రకాష్ తెలిపారు. మండలంలోని సంతగవిరమ్మపేట, వినాయకపల్లి గ్రామాల్లో డ్రోన్ పిచికారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆధునిక పద్ధతులు అవలంభించాలన్నారు. డ్రోన్‌తో పిచికారీ వల్ల డబ్బు, సమయం ఆదా అవుతాయని చెప్పారు. అవసరమైన కషాయాలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వద్ద సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


డ్రోన్‌తో కషాయాల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీఎల్ ప్రకాష్, తదితరులు

వివాదాస్పదంగా మారిన శ్మశానవాటిక

- రెండు గ్రామాల మధ్య చెలరేగిన చిచ్చు


పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తమ్మన్నమెరక గ్రామస్తులు

కొత్తవలస: అప్పన్నదొరపాలెం పంచాయతీ పరిధి తమ్మన్నమెరక, జోడిమెరక గ్రామాల మధ్య శ్మశానవాటిక చిచ్చు రేగింది. మా గ్రామ పరిధిలో దహనసంస్కారాలు చేయొద్దని ఒక వర్గం అంటే.. అలా ఎలా కుదురుతుందని మరోవర్గం పట్టుబట్టింది. వివరాల్లోకి వెళితే.. రెల్లి రెవెన్యూ పరిధిలో అప్పన్నదొరపాలెం పంచాయతీ ఉంది. ఈ పంచా యతీ పరిధిలో తమ్మన్నమెరక, జోడిమెరక గ్రామాలున్నా యి. అయితే జోడిమెరక గ్రామానికి చెందిన శ్మశానవాటిక సర్వే నంబర్ 11లో సుమారు 4.94 ఎకరాల్లో ఉంది. ఈ శ్మశానాన్ని కొంతమంది రియల్టర్లు ఆక్రమించుకుని ప్లాట్లు వేసుకుని అమ్మేశారు. దీంతో జోడిమెరక గ్రామంలో ఎవరైనా చనిపోతే చెంతనే గల తమ్మన్నమెరక గ్రామానికి చెందిన శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేస్తున్నారు. జోడిమెర క వాసులు తమ శ్మశానాన్ని వినియోగించుకోవడంపై తమ్మ న్నమెరక వాసులు అడ్డు చెప్పారు. నాలుగు రోజుల కిందట జోడిమెరక గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందగా దహన సంస్కారాల కోసం తమ్మన్నమెరక శ్మశానికి తీసుకురాగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో రెవెన్యూ, పంచా యతీ అధికారులు చొరవ తీసుకొని దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకుందామని భావించి అప్పన్నదొరపాలెం పంచాయతీ కార్యాల యం వద్దకు సర్పంచ్ జోడి రాములమ్మ, గ్రామస్తులు ఆదివారం రావాలని జోడిమెరక వాసులను తమ్మన్నమెరక పెద్ద లు సూచించారు. అనుకున్న సమయానికి తమ్మన్నమెరక గ్రామస్తులు అప్పన్నదొరపాలెం పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నా.. జోడిమెరక గ్రామస్తులు రాలేదు. దీంతో సహనం కోల్పోయిన తమ్మన్నమెరక వాసులు తమ గ్రామంలోని శ్మశానవాటికను వినియోగిస్తే ఒప్పుకునేది లేదని స్పష్టం చేస్తూ అక్కడ నుంచి వెనుదిరిగారు. దీంతో ఈ వ్యవహారం ఎటు పోతుందోనని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.